క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ జాతర



గంగమ్మకు పూజలు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని వీవీ కండ్రిక గ్రామంలో గురువారం ఘనంగా గంగమ్మ జాతర నిర్వహించారు. ఉదయం నుంచే పెద్దఎత్తున భక్తులు ఈ జాతరలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మందల నాగేంద్ర, బుడుగు శివయ్య, ఉత్తరాది శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు లేని వాహనాలకు జరిమానా



వాహనాల రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

చిన్నమండెం : వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులను తమ దగ్గర ఉంచుకోవాలని చిన్నమండెం ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. గురువారం మండల పరిధిలోని దేవగుడిపల్లె క్రాస్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు వాహనాలను తనిఖీ చేసి రికార్డులు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఆయన వెంట పలువురు పోలీసు సిబ్బంది ఉన్నారు.

క్లోరినేషన్ ప్రక్రియను చేపట్టండి



నీటి ట్యాంకులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పార్వతి

నందలూరు : మంచినీరు సరఫరా చేస్తున్న ట్యాంకులలో క్లోరినేషన్ ప్రక్రియను నిర్వహించడమే కాక పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాజంపేట డివిజనల్ పంచాయతీ అధికారిణి పార్వతి అన్నారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లెలో పలు మంచినీటి ఉపరితల ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని, ప్రజలకు సరఫరా చేసే నీరు పరిశుభ్రంగా అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, కార్యదర్శి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీ కోసం ఎదురుచూపులు



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

పుల్లంపేట : ఉపాధి హామీ కూలీలకు గత ఎనిమిది వారాలుగా కూలీ డబ్బులు అందక నానా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్లి జీవనం సాగిస్తుంటారు. గత ఎనిమిది వారాలుగా కూలీ డబ్బులు ఖాతాలో జమకాలేదని, ప్రభుత్వం స్పందించి వెంటనే కూలీ బకాయిలు చెల్లించాలని ఉపాధిహామీ కూలీలు కోరుతున్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

రాయచోటి అర్బన్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన ఎం.లోకనాథరెడ్డి ఆర్థిక సౌజన్యంతో క్లబ్‌సభ్యులు పట్టణ శివార్లలోని చిత్తూరు రోడ్డులో గుడిసెలలో నివసించే పేదలకు ఆహార పొట్లాలను అందజేశారు. క్లబ్ సభ్యులు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

నందలూరు : అరవపల్లెలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో క్రికెట్ టోర్నీ శుక్రవారం (నేడు) నుంచి ప్రారంభం కానుంది. దివంగత తుంటి యానాదయ్య, సరోజనమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు తుంటి నందా యాదవ్ ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. హార్డ్ టెన్నిస్ బాల్‌తో జరిగే ఈ టోర్నీలో నందలూరు, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల నుంచి రిజిస్టర్ చేసుకున్న జట్లు పాల్గొననున్నాయని నిర్వాహకుడు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన వారికి రూ. 40 వేలు, రన్నర్స్‌కు రూ. 25 వేలు అందజేయనున్నట్టు తెలిపారు.

తూటాలను లెక్కచేయని మన్యం వీరుడు అల్లూరి

- ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి
- నివాళి అర్పించిన ఎమ్మెల్యే ఆకేపాటి, నాయకులు, అధికారులు
- ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపు



రాజంపేట టౌన్: మన్యం వీరుడు అల్లూరి విగ్రహానికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే ఆకేపాటి, నాయకులు

రాజంపేట టౌన్ : భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో మన్యం వీరుడు, విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. అల్లూరి జయంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా సర్కిల్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఘనంగా నివాళులర్పించారు. తొలుత అల్లూరి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిటీష్ వారి తూటాలను సైతం లెక్క చేయకుండా ఎదురెళ్లి తెల్లదొరలను గడగడలాడించిన పోరాట యోధుడు అల్లూరి అన్నారు. పిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసి భారతీయుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలిచ్చిన వ్యక్తిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ఆ మహనీయుడి ఆశయాలను ఆచరణలో పెట్టే దిశగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత అల్లూరిలోని నాయకత్వ లక్షణాలను, త్యాగస్ఫూర్తిని, దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు డి.భాస్కర్‌రాజు, వరదరాజు, రామలింగరాజు, వెంకట్రాజు, రఘురామరాజు, హెచ్‌వీ.రాజు, జెనుగు కృష్ణారావు యాదవ్, వడ్డే రమణ, డీలర్ సుబ్బరామిరెడ్డి, మిర్యాల సురేఖ, లేబాక సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు

సిద్దవటం : భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ డి.నాగేశ్వరప్ప ముఖ్య అతిథిగా పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి, ఈయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి దాని కొరకే తన ప్రాణాలను అర్పించిన యోధుడు, కేవలం 27 ఏళ్ల వయస్సులోనే బ్రిటీష్ సామ్రాజ్యమనే మహాశక్తిని ఢీ కొన్నాడని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు కమాండెంట్ వి.జయప్రసాద్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దవటం: అల్లూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అడిషనల్ కమాండెంటు నాగేశ్వరప్ప

నందలూరులో..

నందలూరు : అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. అరవపల్లెలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం సమీపంలో జరిగిన ఈ వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అల్లూరి చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి పోరాట స్ఫూర్తిని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యనారాయణ, జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ కార్యదర్శి సయ్యద్ అమీర్, తాటి సుబ్బరాయుడు, మోడపోతుల రాము, గోపినేని హిమగిరినాథ్ యాదవ్, షేక్ మౌలా, తుమ్మాది శివకుమార్, శివ, నరసింహులు, తుంటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో..

పెనగలూరు (ఓబులవారిపల్లె) : ఏపీ మోడల్ స్కూల్‌లో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు గురువారం పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రియాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహాశక్తి అన్నారు. అల్లూరి జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక ఆయుధమని కొనియాడారు. మన్యం వాసుల హక్కుల కోసం పోరాడి వారికి మనోధైర్యం నింపారన్నారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రుల అభిమన్యుడు అల్లూరి

గాలివీడు : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆంధ్రుల అభిమన్యుడని, ఆయన ఆంధ్రుడు అయినందుకు మనమందరం ఎంతో గర్వపడాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఉద్ఘాటించారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయనతోపాటు ఆర్‌ఐ బాలాజీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మరువలేని మన్యం వీరుడు అల్లూరి

రాజంపేట : దేశ స్వాతంత్ర్య సమరయోధులలో మరువలేని ధీరుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని రాజంపేట ఆర్డీఓ మోహనరావు కొనియాడారు. గురువారం ఆర్డీఓ చాంబరులో అల్లూరి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులను దేశం నుంచి తరిమికొట్టేందుకు అల్లూరి చేసిన పోరాట పటిమలను స్మరించుకోవాలన్నారు. అనంతరం అల్లూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నందలూరు: అల్లూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం



పెనగలూరు: ఏపీ మోడల్ స్కూల్‌లో..



గాలివీడు: అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెవెన్యూ అధికారులు



రాజంపేట: అల్లూరికి నివాళి అర్పిస్తున్న ఆర్డీఓ మోహనరావు

మూడు పీఎఫ్ ఖాతాలను ఒకే ఖాతాగా మార్చండి

రాయచోటి అర్బన్ : మున్సిపల్ కార్మికులకు చెందిన మూడు పీఎఫ్ ఖాతాలను ఒకే ఖాతాగా మార్చాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేతలు బి.వి.రమణ, చెన్నయ్యలు డిమాండ్ చేశారు. గురువారం తమ సమస్యల పరిష్కారంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వారు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2005 నుంచి నేటి వరకు మున్సిపల్ కార్మికుల పీఎఫ్ ఖాతాలు మూడుగా ఉండేవన్నారు. కార్మికుల సౌకర్యార్థం మూడు పీఎఫ్ ఖాతాలన్ని కలిపి ఒకే ఖాతాగా మార్చాలని మున్సిపల్ అధికారులకు ఎన్నిమార్లు వేడుకున్నా ఫలితం లేకుండా పోతోందన్నారు. మున్సిపల్ డ్రైవర్లకు రూ.24,500ల జీతం ఇవ్వాలని ఉన్నప్పటికీ రాయచోటి మున్సిపల్ అధికారులు స్పందించకపోతుండడం దారుణమన్నారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలంటూ కోరారు. మిగతా మున్సిపాలిటీలలో ఎన్నికల్లో పనిచేసిన కార్మికులకు రెండు, మూడురోజుల స్టైఫండ్ ఇచ్చారని, రాయచోటి, రాజంపేట మున్సిపాలిటీల్లో పనిచేసిన కార్మికులకు వెంటనే స్టైఫండ్ చెల్లించాలంటూ కోరారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలను ఇవ్వాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500లుగా ఇవ్వాలన్నారు. కార్మికులకు నాణ్యమైన పనిముట్లతోపాటు మాస్కులు, గ్లౌజ్‌లు తదితరాలను ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్‌ను కలుసుకుని ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులతోపాటు పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



జేసీ ఫర్మాన్ అహమ్మద్‌కు సమస్యలు విన్నవిస్తున్న మున్సిపల్ కార్మికులు

నొక్కేదెట్టా.. దాహం తీరేదెట్టా?

రాజంపేట టౌన్ : మూగజీవులు తమకు కావాల్సినవి నోరు తెరచి అడగలేవు. మూగజీవులకు కావాల్సింది ఆకలేసినప్పుడు ఆహారం, దాహం వేసినప్పుడు నీళ్లు. వీటి కోసం నిరంతరం సంచరిస్తూనే ఉంటాయి. ఇదిలావుంటే రాజంపేట రైల్వేస్టేషన్‌లో గురువారం ఓ రెండు వానరాలకు దాహం వేసింది. దాహం తీర్చుకునేందుకు మొదటి ప్లాట్‌ఫాం మీద ఉన్న రెండు కుళాయిల వద్దకు రెండు వానరాలు వచ్చాయి. అయితే కుళాయిని ప్రెస్ చేస్తేనే నీళ్లు వస్తాయని తెలియని వానరాలు నీటిని తాగేందుకు విశ్వప్రయత్నమే చేశాయి. అయితే అక్కడున్న ప్రయాణికులు వానరాలకు తీవ్ర దాహం వేస్తోందని, వాటి దాహం తీర్చేందుకు నెమ్మదిగా కుళాయి వద్దకు వెళ్లి కుళాయిలను ప్రెస్ చేశారు. అయితే వానరాలు వారిని చూసి పరిగెత్తిపోయాయి. దాహం తీరకుండానే వెళ్లిన వానరాలను చూసి ప్రయాణికుల మనసు నొచ్చుకున్నాయి.



దాహం తీర్చుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్న వానరాలు

తాగునీటి కోసం మహిళల నిరసన



తాగునీటి కోసం నిరసన తెలుపుతున్న ఎస్‌కేఆర్ నగర్ గ్రామ మహిళలు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్ గ్రామంలోని మహిళలు తాగునీటి కోసం గ్రామంలో గురువారం ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ ఎస్‌కేఆర్ నగర్ గ్రామంలో గత కొన్ని రోజులుగా మాకు తాగునీరు అందలేదన్నారు. గ్రామానికి తాగునీరు అందించకపోతే సచివాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. నిరుపేదలమైన మేము మంచినీరును కొనుకోవాల్సిన పరిస్థితి దాపురించిదన్నారు. అంగన్‌వాడీ స్కూల్‌కు కూడా మంచినీరు లేక పిల్లలు అవస్థలు పడుతున్నారని తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా ఎస్‌కేఆర్ నగర్ గ్రామానికి మంచినీటి సమస్యను వారంలో పరిష్కరిస్తామని తెలియజేశారు.

రామయ్య సన్నిధిలో యోగా గురువు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలో కొలువైన కోదండరాముడిని తిరుపతికి చెందిన యోగా గురువు కైలాస గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, టీటీడీ సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించారు. అనంతరం వారు సీతారామ లక్ష్మణ విగ్రహ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆయన్ను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.



స్వామి దర్శించుకుని వస్తున్న యోగా గురువు కైలాస

విద్యాసంస్థల బంద్ విజయవంతం

రాయచోటి అర్బన్ : విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి నిరసనగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం పట్టణంలో విద్యార్థి సంఘాలు నిర్వహించిన బంద్ విజయవంతమైంది.

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, ఎస్‌ఎఫ్‌ఐ రాయచోటి నేత నరేష్, ఆర్‌ఎస్‌యూ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌ల నేతృత్వంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. బంద్‌ను పురస్కరించుకుని విద్యార్థి సంఘాల వారు పట్టణ పరిధిలోని అని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల వద్దకు వెళ్లి వాటిని మూయించివేసి విద్యార్థులను ఇళ్లకు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో తన అసమర్థతలను చాటుకున్న ఎన్‌టీఏను వెంటనే రద్దుచేయాలన్నారు. పరీక్ష నిర్వహణ వైఫల్య సంఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామాను సమర్పించాలంటూ కోరారు. నీట్ పరీక్షను రద్దుచేయాలంటూ ఏపీలోని ఎన్‌డీఏ కూటమి అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయాలంటూ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను తిరిగి నిర్వహించడం ద్వారా దేశంలోని పేదవైద్య విద్యార్థులకు న్యాయం చేయాలంటూ కోరారు. బంద్ సందర్భంగా పాఠశాలలు, కళాశాలల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి భద్రతాచర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ప్రశాంత్, కార్తీక్, వాసుదేవనాయక్, సతీష్‌నాయక్, ప్రవీణ్, రమణ, రాంబాబు, రెడ్డికుమార్ పాల్గొన్నారు.



రాయచోటి అర్బన్: బంద్‌లో పాల్గొన్న విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : మండల వ్యాప్తంగా ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సంచలన రేపుతున్న నీట్ పరీక్ష పేపర్లలో లీకేజీని ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్‌టీఏ రద్దు చేయాలని, నీట్ ఎగ్జామ్ నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. నీట్ ఎగ్జామ్ రీకండక్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌డీ అడ్మిషన్ కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్‌స్కోర్ విధానాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు మూసివేతను ప్రభుత్వాలకు అప్పజెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజంపేట టౌన్: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

రాజంపేట టౌన్ : నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ డిమాండ్ చేశారు. నీట్ అవకతవకలకు నిరసనగా గురువారం పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పట్టణంలో విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని చేపట్టాయి. నీట్ పరీక్షా పత్రాల లీకులకు కారణమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని వెంటనే రద్దు చేసి, పరీక్ష రాసిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలన్నారు. నీట్ పరీక్షా పత్రాల లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలని లేకుంటే ఆందోళనా కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నాని, సుదర్శన్, యశ్వంత్, ప్రవీణ్, కుమార్, సాయి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా



లారీ ద్వారా తరలిపోతున్న కలప

పుల్లంపేట : ఒకవైపు వర్షాలు లేక నానా ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు అధికారులు చెట్లు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రకటనలు చేస్తున్నారు. అయితే అక్రమదారులు ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లను నరికివేస్తూ యథేచ్ఛగా సొమ్ము చేసుకుంటున్నారు. నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కడప – చెన్నై జాతీయ రహదారిపై నిత్యం కలపను తరలిస్తున్నారు. చెక్ పోస్టుల వద్ద మాముళ్లు తీసుకుంటూ వదిలివేయడంతో కలప అక్రమంగా రవాణా అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఒంటిమిట్ట : విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఒంటిమిట్ట ఎంపీడీఓ జీవీ రామచంద్ర అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని రాచపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి, భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

చెరువుకుంటనా.. రహదారా?

సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామంలో రహదారి కొద్దిపాటి వర్షానికే చెరువు కుంటగా మారుతోందని స్థానికులు తెలిపారు. గ్రామంలోని ఎస్టీ కాలనీలోకి వెళ్లే రహదారి అంగన్‌వాడీ స్కూల్ వద్ద వర్షం నీరు నిల్వ ఉంటోంది. దీంతో స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు నీటిలో నుంచి వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. గ్రామంలో నీరు నిల్వ ఉండటం వల్ల లార్వా ఏర్పడి దోమలు ఉత్పత్తి చెందుతాయని దీంతో సీజనల్ వ్యాధులు సంభవిస్తాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పక్కనే అంగన్‌వాడీ స్కూల్ ఉండటం వల్ల పిల్లలకు ఇప్పటికే కొందరికి జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని గ్రామస్తులు తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని రహదారిపై నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వర్షం నీటితో కుంటను తలపిస్తున్న జ్యోతి గ్రామంలోని అంగన్‌వాడీ స్కూల్ వద్ద ఉన్న రహదారి

ఘనంగా వంగవీటి రంగా జయంతి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని కృష్ణదేవరాయల విగ్రహం వద్ద కాపు నాయకులు గురువారం ఘనంగా వంగవీటి మోహనరంగ 77వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులాలకు, మతాలకు అతీతంగా పేద ప్రజల కోసం పాటుపడిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని కొనియాడారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, సీసీ, నందాబాల, శివయ్య, రామకృష్ణ, పి.మణి, మల్లికార్జున, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



కేక్ తినిపించుకుంటున్న కాపు నాయకులు

సంపూర్ణత అభియాన్‌తో పేదలకు ఉపయోగం

రైల్వేకోడూరు : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం యాస్పిరేషన్ బ్లాక్‌లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్వామా పీడీ మద్దిలేటి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జి.రత్నమ్మ, సర్పంచ్ శివయ్య, ఎంపీటీసీ మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ పీఆర్‌డీ నాగార్జున, ఉపాధి హామీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ మద్దిలేటి